

కరెన్సీ గణపతి

సుల్తానాబాద్: గణేశ్ నవరాత్రుల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఆర్యవైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని శుక్రవారం రాత్రి రూ.9,99,999ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గణనాథున్ని దర్శించుకుంటున్నారు.

న్యూస్‌రీల్

పవర్‌ప్లాంట్ పూర్తయ్యేలా ఆదేశాలివ్వాలి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: బీ థర్మల్ పవర్ ప్లాంట్ స్థానంలో మంజూరైన 800 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంటు త్వరగా పూర్తిచేసేలా ఆదేశాలివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలు విన్నవించారు. పవర్‌ప్లాంట్ సంబంధించి అన్ని రకాల వనరులు స్థలం, నీరు, బొగ్గు, రవాణా తదితరుల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్లాంటు ఏర్పాటుతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. అలాగే సింగరేణి ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో అదనపు విభాగాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరపాలి



ఎల్లమ్మ చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరపాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి ఎల్లమ్మ, గుండమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తదితరులతో కలిసి పరిశీలించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశమివ్వొద్దన్నారు. సీసీ కెమెరాలను అమర్చి విగ్రహాల నిమజ్జనంకు అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య



రాస్తారోకోలో కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు

గోదావరిఖని: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిబ్రిడ్జిపై పార్టీ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. శాంతి భద్రతలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కౌశిక్‌రెడ్డిని ఇంటిలోనే నిర్బంధించిన పోలీసులు, అరికపూడి గాంధీని మాత్రం వందలాది అనుచరులతో కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి వెళ్లి దాడి చేసేలా ఉసిగొల్పారన్నారు. రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు పెంట రాజేశ్, బొడ్డు రవీందర్, నూతి తిరుపతి, జక్కుల తిరుపతి, కృష్ణవేణి, విజయ, లక్ష్మి, సంధ్యారెడ్డి, స్వప్న, తిరుమల తదితరులున్నారు.

పోలీసుల అదుపులో నాయకులు

హైదరాబాద్ తరలివెళ్లకుండా పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను ముందుస్తుగా అరెస్ట్ చేసి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో నాయకులు పర్లపల్లి రవి, జేవీరాజు, ర్యాకం వేణు, పాముకుంట్ల భాస్కర్ తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కమాన్‌పూర్: ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్కా రాంకిషన్‌రావు డిమాండ్ చేశారు. డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం కమాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ పాఠశాలలో తరగతి గదికో ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని అన్నారు. విలేకరుల సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యాం, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, రాష్ట్ర కౌన్సిలర్లు రాజమౌళి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వందేభారత్ వస్తోంది..



- 130 కిలోమీటర్ల వేగంతో నాగ్‌పూర్ సికింద్రాబాద్ మధ్య సర్వీసు
- సోమవారం నుంచి ఉమ్మడి జిల్లా వాసులకు అందుబాటులోకి..
- రామగుండంలోనే హాల్టింగ్.. రోజుకు రెండుసార్లు సేవలు
- పెద్దపల్లి, జమ్మికుంటకు హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్
- గతేడాది విజయవంతంగా ట్రయల్ రన్

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ రైలు ఉమ్మడి జిల్లాకు వస్తోంది. ఈనెల 16 సోమవారం నుంచి నాగ్‌పూర్- సికింద్రాబాద్ మధ్య నడిచే ఈ రైలు సేవలు ప్రతిరోజూ (మంగళవారం మినహా) అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం మనరాష్ట్రంలో వందేభారత్ సేవలు రెండురూట్లలోనే ఉన్నాయి. మొదటిది విశాఖపట్నం- సికింద్రాబాద్ కాగా, రెండోది కాచిగూడ- తిరుపతి సర్వీసులు. ఇవి రెండు దక్షిణ మధ్యరైల్వేకు కేటాయించారు. తాజా సర్వీసు సెంట్రల్ రైల్వే కేటాయించిన నాగ్‌పూర్ డివిజన్‌కు చెందినది. సోమవారం ఉదయం ప్రధాని ఈ రైలుకు పచ్చజెండా ఊపగానే.. నాగ్‌పూర్ నుంచి బయల్దేరుతుంది. ఇనాగ్యురల్ రైలు కావడంతో రామగుండానికి రాత్రి 8.30గంటలకు చేరుకుంటుంది. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ స్వాగతం పలుకుతారు.

కేవలం 3 గంటల్లో రాజధానికి..

దేశంలోనే అత్యంత వేగంగా నడిచే రైలుగా వందేభారత్ ప్రసిద్ధి చెందింది. ఈ సర్వీసు ఉమ్మడి జిల్లాకు అందుబాటులోకి రావడాన్ని అంతా స్వాగతిస్తున్నారు. ఇకపై రామగుండం నుంచి సికింద్రాబాద్‌ను కేవలం మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. తెలంగాణలో ఈ సర్వీసుకు కేవలం రామగుండం, ఖాజీపేటలో మాత్రమే హాల్టింగ్ కల్పించారు. ప్రతీరోజూ ఉదయం 5గంటలకు నాగ్‌పూర్‌లో (ట్రైన్ నంబరు 20101) బయల్దేరుతుంది. రామగుండంలో ఉదయం 9.15 గంటలకు చేరుతుంది. సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 12.15 గంటలకు ఉంటుంది. తిరిగి మధ్యాహ్నం 1గంటలకు సికింద్రాబాద్ నుంచి (ట్రైన్ నెం.20102)బయల్దేరి.. రామగుండానికి మధ్యాహ్నం 3.15 గంటలకు చేరుకుంటుంది. 20కోచ్‌లు ఉండే ఈ రైలు సోమవారం నుంచి ఉమ్మడి జిల్లా ప్రజలకు సేవలు అందించనుంది.



రూటు	స్పీడు
సికింద్రాబాద్- బల్లార్షా మార్గంలో	130 కి.మీ,
ఖాజీపేట-కొండపల్లి	130 కి.మీ,
సికింద్రాబాద్-ఖాజీపేట	130 కి.మీ,
మానిక్‌నగర్- విరూర్ (3వలైన్)	110 కి.మీ,
మందమర్రి- మంచిర్యాల (3వలైన్)	110 కి.మీ
మంచిర్యాల- పెద్దంపేట (3వలైన్)	100 కి.మీ
పెద్దంపేట- రాఘవపురం (3వ లైన్)	110. కి.మీ
రాఘవపురం- కొలనూరు-పొత్కపల్లి (3వలైన్)	90 కి.మీ.
బిజిగిరి షరీఫ్- ఉప్పల్ (3వలైన్)	100 కి.మీ
పెద్దపల్లి- కరీంనగర్	100. కి.మీ
కరీంనగర్- జగిత్యాల(లింగంపేట)	90 కి.మీ.
జగిత్యాల(లింగంపేట)- నిజామాబాద్	100 కి.మీ
మేడ్చల్- మనోహరాబాద్ సెక్షన్	110 కి.మీ,
మల్కాజిగిరి- మౌలాలి కార్డ్‌లైన్	30.కి.మీ

పెద్దపల్లి, జమ్మికుంటలో హాల్టింగ్ ఇవ్వాలి

వందేభారత్ సేవలకు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది. దీని టికెట్ ఖర్చు అధికంగా ఉన్నా.. వేగంగా వెళ్లాలనుకున్న వారంతా దీన్నే ఎంచుకుంటున్నారు. అయితే ఉమ్మడి కరీంనగర్‌కు సంబంధించి కేవలం రామగుండంలో మాత్రమే నిలుపుతున్నారు. రామగుండం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలవాసులకు అంత సౌకర్యం కాదు. పెద్దపల్లి, జమ్మికుంట స్టేషన్‌లకు రోడ్ కనెక్టివిటీ బాగున్న నేపథ్యంలో ఈ స్టేషన్లలోనూ హాల్టింగ్ ఇవ్వాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఖాజీపేట -బల్లార్షా మధ్య 130 కి.మీతో..

ఈ రైలు మూడు డివిజన్లలోని పలు సెక్షన్లలో సామర్థ్యాన్ని బట్టి వేగం మారుతోంది. ఖాజీపేట- బల్లార్షా సెక్షన్‌లో 130 కి.మీ గరిష్ఠ వేగంతో వెళ్తుంది. పెద్దపల్లి-కరీంనగర్ 100. కి.మీ, కరీంనగర్-జగిత్యాల(లింగంపేట) 90 కి.మీ. వేగంతో వెళ్లేలా ట్రాక్‌లు ఇటీవల అప్‌గ్రేడ్ చేశారు. అతి తక్కువగా మల్కాజిగిరి- మౌలాలి సెక్షన్లలో కేవలం 30.కి.మీ స్పీడుకే పరిమితం కావడం గమనార్హం. వేగంపై లైన్ అప్‌గ్రేడేషన్‌తోపాటు లెవెల్ క్రాసింగ్స్, రైల్ ట్రాఫిక్ కూడా ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం బల్లార్షా- ఖాజీపేట సెక్షన్‌లో 110 కి.మీల వేగంతో వెళ్తుందని అధికారులు తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం తుర్కలమద్దికుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉండటం గమనించిన కలెక్టర్ పిల్లల హాజరుపై సైతం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ వారి ప్రమాణాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధిక సంఖ్యలో ప్రజలు వేచి చూడకుండా రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్ డాక్యుమెంట్లను త్వరితగతిన సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి సబ్ రిజిస్టర్ బి.కుమార్, రామగుండం సబ్ రిజిస్టర్ తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ధర్మారం: ధర్మారం మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనతో పాటు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి శనివారం హాజరవుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రుల పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాస్‌లు శుక్రవారం పరిశీలించారు. సాయంపేట శివారులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, మేడారం, కటికెనపల్లిలో ఏర్పాటు చేస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల శంకుస్థాపన స్థలాలను పరిశీలించి ధర్మారంలో ఏర్పాటు చేస్తున్న సభా వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ పోలీసు అధికారులకు, స్థానిక నాయకులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఎలాంటి ఆటంకాలు జరుగకుండ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్, నాయకులు ఉన్నారు.

పెద్దపల్లి నియోజకవర్గంలో..



రూట్‌మ్యాప్ పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్, సీపీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే విజయరమణారావు, సీపీ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ కాచాపూర్, పెద్దపల్లి, రంగాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు, పెద్దపల్లిలో నీటిపథకం పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. పెద్దపల్లి జెండాకూడలిలో బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. బందోబస్తు చర్యలపై పోలీసు అధికారులకు సీపీ శ్రీనివాస్ పలు సూచనలిచ్చారు.

భద్రత నియమాలు పాటించాలి

రామగిరి: భద్రత నియమాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని సౌత్ సెంట్రల్ జోన్-2 డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) రాజీవ్ ఓంప్రకాశ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో పర్యటించి జీఎం కార్యాలయం సమావేశ మందిరంలో విద్యుత్ భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యుత్ భద్రతకు సంబంధించిన నిబంధనలు వివరించారు. నిర్లక్ష్యం చేయకుండా జాగ్రతలు పాటిస్తూ పని ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్.గుప్తా, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం ఎన్.రాధాకృష్ణ, ఎస్ఓటూ జీఎంలు జీ.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఏరియా సేఫ్టీ అధికారి జే.రాజశేఖర్, ప్రాజెక్టు అధికారులు కె.నాగేశ్వరరావు, సీహెచ్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజీవ్ ఓంప్రకాశ్‌వర్మ

నేడు మంథనిలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభం

మంథని: మంథని శివారు గోదావరిఖని రోడ్డులో గీట్లస్ హబ్ వద్ద నూతన సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్రాంచ్‌ను శనివారం రాష్ట్ర ఐటీ,, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మంథనిలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల మంత్రి ప్రకటించిన నేపథ్యంలో బ్రాంచ్ సేవలు అందుబాటులో వస్తుండడంతో ఈప్రాంత యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణిలో అసలేం జరుగుతోంది!

- అధికారుల్లో హాట్ టాపిక్‌గా డైరెక్టర్ చర్చ
- ఇద్దరు డైరెక్టర్లకు అదనపు బాధ్యతలు
- రెస్క్యూటీంతో కొలంబియా టూర్ అర్ధంతరంగా వాయిదా
- లాంగ్‌లీవులో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్?



సింగరేణి సీఅండ్‌ఎండీ కార్యాలయం

గోదావరిఖని: సింగరేణిలో అసలేమి జరుగుతోంది..? మరో 16 నెలల పాటు కొనసాగాల్సిన డైరెక్టర్ పోస్టును వేరే వారికి అప్పగిస్తారా? ప్రస్తుతం పనిచేస్తున్న డైరెక్టర్‌కే తిరిగి కట్టబెడతారా? రెస్క్యూటీంతో కొలంబియా వెళ్లాల్సిన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ అర్ధంతరంగా పర్యటన ఎందుకు వాయిదా వేసుకున్నట్లు? డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్(పా) బాధ్యతల్లో కొనసాగుతున్న శ్రీనివాస్‌కు సంబంధించిన బాధ్యతలను ఇద్దరు డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరావుకు అదనంగా అప్పగించడం వెనుక మతలబు ఏమిటనే చర్చ సింగరేణిలో జోరుగా సాగుతోంది.

చర్చనీయాంశంగా డైరెక్టర్ వ్యవహారశైలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి సంస్థలో ఇటీవల ఎన్నడూ లేనివిధంగా డైరెక్టర్ వ్యవహారశైలి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా సంస్థలో ఆపరేషన్ డైరెక్టర్‌తో పాటు డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్‌వీకే.శ్రీనివాస్‌ను అర్ధాంతరంగా పోస్టు నుంచి తప్పించినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. సింగరేణి యాజమాన్యం ఆదేశాలతో కొలంబియా పర్యటన వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న బాధ్యతలను కూడా ఇద్దరు డైరెక్టర్లకు అప్పగించారు. కొలంబియా పర్యటన నేపథ్యంలో ఈబాధ్యతలు ఇద్దరికి అప్పగించారని చెబుతున్నప్పటికీ కొన్ని అంశాల్లో విభేదాల కారణంగా డైరెక్టర్ పోస్టు నుంచి తప్పించినట్లు ప్రచారం జరుగుతోంది.

పర్చేజ్ ఫైళ్ల జాప్యంతోనే విభేదాలా?

సింగరేణికి సంబంధించిన కీలక ఫైళ్ల సంతకాల విషయంలో జాప్యం మూలంగానే విభేదాలు తలెత్తినట్లు చెప్పుకుంటున్నారు. ప్రధానంగా పర్చేజ్ టెండర్ల విషయంలో కొన్ని ఫైళ్లు కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ప్రభుత్వం నుంచి ఒత్తిడి మేరకు డైరెక్టర్‌ను బాధ్యతల నుంచి తప్పించారనే ప్రచారం వినిపిస్తోంది.

కొలంబియా పర్యటన వాయిదా

సింగరేణి రెస్క్యూ బృందం అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొంటోంది. ఈక్రమంలో రెస్క్యూ బృందం వెంట డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే. శ్రీనివాస్ ఈనెల 10న వెళ్లాల్సి ఉన్నప్పటికీ అర్ధాంతరంగా వాయిదా వేసుకున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారికంగా స్పందించడానికి ఉన్నతాధికారులు నిరాకరిస్తున్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

- తీగజాతి తోటలు, వెదురు పెంపకానికి ప్రత్యేక రుణాలు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పండ్లతోటలు, కూరగాయల పంటలు సాగు చేసే రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నామని జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పండ్లు, కూరగాయల తోటలకు వాతావరణ పరిస్థితుల కారణంగా సోకిన చీడ, పీడల నివారణకు అవసరమైన సలహా, సూచనల కోసం 'సాక్షి' శుక్రవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పలువురు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. తీగజాతి తోటలు, వెదురు పెంపకం కోసం ప్రత్యేక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక ప్రయోజనాలున్న ఆయిల్‌ఫాం సాగుపై దృష్టి సారించాలన్నారు. పండ్లు, కూరగాయల సాగు రైతులు తమ సమస్యలను ఉద్యానవన అధికారులు మహేశ్ (8977714040), జ్యోతి (8977714039)లను సంప్రదించాలని సూచించారు.



జగన్మోహన్‌రెడ్డి, డీహెచ్‌ఎస్‌వో

ప్రశ్న: టమాట తోటలో ఆకులు, కొమ్మలు గోధుమ రంగుకు మారి ఎండిపోతున్నాయి?

– బొక్కల సంతోష్, దేవునిపల్లి, పెద్దపల్లి మండలం

డీహెచ్‌ఎస్‌వో: నత్రజని లోపంతో ఇలాంటి తెగులు సోకుతుంది. నివారణకు హెక్సాకొనంజోల్, కాప్టర్, 1.5గ్రా., 13-0-45-5గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా అరికట్టవచ్చు.

ప్రశ్న: బెండ పంట పసుపు రంగులోకి మారింది. అలసందకు పేను ఎక్కువైంది?

– గోపాల్‌రావు, ధూళికట్ట, ఎలిగేడు మండలం

డీహెచ్‌ఎస్‌వో: బెండ సాగులో మోజాయిక్ వైరస్ సోకడం వల్ల రంగు మారింది. నివారణకు ఫ్లోనికామిడ్ 80మి.లీ., ఇమిడాక్లోప్రిడ్ 100మిలీ., 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలసందలో పేను ఉధృతి నివారణకు థియోమ్రాక్సన్ 0.4గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: ఇంటి ఆవరణలో బత్తాయి చెట్లు పెంచుతున్నాం. వాటి కాయలు చేదు వస్తున్నాయి?

– బి. రమేశ్, సుల్తానాబాద్

డీహెచ్‌ఎస్‌వో: మొక్కలోనే లోపం ఉంది. సాధారణంగా పక్వానికి వచ్చిన తర్వాత పండ్లు రుచి మారుతుంది. మేలు జాతిరకం మొక్కను నాటుకోవడమే మంచిది.

ప్రశ్న: బీరతోటలో పండు ఈగ సమస్య ఎక్కువగా ఉంది?

– మహిపాల్‌రెడ్డి, బొమ్మారెడ్డిపల్లి, ధర్మారం మండలం

డీహెచ్‌ఎస్‌వో: ట్రాప్స్ అమర్చుకుంటే పండుఈగ ఉధృతి తగ్గుతుంది.

ప్రశ్న: కూరగాయల పంట సాగుకు రాయితీ ఉన్నాయా?

– ఆవుల అనిల్‌కుమార్, కుమ్మరికుంట

డీహెచ్‌ఎస్‌వో: ప్రస్తుతానికి టమాట, వంగ, మిర్చి హైబ్రిడ్ రకం నారును రాయితీపై అందిస్తున్నాం.

ప్రశ్న: ఆయిల్‌పాం సాగుతో ప్రయోజనాలేంటీ?

– ప్రభాకర్‌రెడ్డి, రేగడిమద్దికుంట

డీహెచ్‌ఎస్‌వో: ఆయిల్‌పాం సాగుతో దీర్ఘకాల ప్రయోజనాలున్నాయి. ఆయిల్‌పాం ఫ్యాక్టరీ కూడా జిల్లాలోని శ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లిలో ఏర్పాటవుతోంది.

అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కిరణ్‌రాజ్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ ఏరియా ఆసుపత్రిలో డీవైసీఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌కు అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించారు. ఈమేరకు కార్పొరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.



కిరణ్‌రాజ్‌కుమార్

లాభాల్లో వాటా కోసం సీఎంను కలుస్తాం

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటా విషయంలో త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలుస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతేడాది సంస్థ సాధించిన లాభాల్లో 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెలాఖరులో కోల్‌కత్తాలో జరిగే కోలిండియా సమావేశంలో పీఎల్‌ఆర్ బోనస్ రూ.లక్ష చెల్లించాలని యూనియన్ డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వైవీరావు, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, ఎంఆర్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయం'మానాల'.. వైద్యం అందేలా..



ఈ మహిళ పేరు మాలోతు గమ్మి. మానాల శివారులోని సర్పంచ్ గిరిజనతండాకు చెందిన గమ్మికి ఏడాదిగా కళ్లు మసకబారాయి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుందామంటే ఆర్థిక స్తోమత లేదు. మెగా వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేసి కళ్లజోడు అందించారు.



ఈమె భూక్యా లింబీ. మానాల శివారులోని రూప్లానాయక్‌తండాకు చెందిన లింబీ రెండేళ్లుగా మెడనొప్పితో బాధపడుతోంది. వ్యవసాయ పనులు చేసే లింబీకి మెగా వైద్యశిబిరంలో డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.



చేతిలో కర్ర.. మాసిన గడ్డంతో ఉన్న ఇతను మాదవేణి గంగారాం. మానాలకు చెందిన గంగారాం కాలుకు సెప్టిక్ కావడంతో ఇబ్బంది పడుతున్నాడు. వైద్యశిబిరంలో పరీక్షలు చేసిన వైద్యులు.. ఎల్లారెడ్డిపేట అశ్విని ఆస్పత్రికి వస్తే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. నొప్పి తగ్గడానికి ప్రస్తుతం మందులు అందించారు. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. ఏకంగా 800 మంది మానాల, ఆ శివారులోని ఏడు గిరిజన తండాల ప్రజలకు పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో ఉచితంగా వైద్యసేవలు అందించారు.

- గిరిజనానికి మెగా వైద్యశిబిరం
- అటవీపల్లెల్లో పోలీసుల చొరవ
- ప్రజా ఆరోగ్యంతోనే పల్లెలు బాగుంటాయి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మెగా వైద్యశిబిరంలో 800 మందికి వైద్యసేవలు

రుద్రంగి(వేములవాడ): మానాల అడవులు.. పోలీసుల బూట్ల చప్పుడు వింటేనే చెట్ల ఆకులు సైతం ఎరుపెక్కేవి. నక్సలైట్ ఉద్యమం ఉధృతంగా ఉన్న రోజుల్లో ఈ ప్రాంతంలో నిత్యం అలజడే. పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ఈ ప్రాంత ప్రజలపై ఆనాటి పోలీస్ వ్యవస్థ నిర్బంధం కొనసాగించింది. తుపాకుల పోరులో మానాలతోపాటు ఆ ఏడు పల్లెలు కన్నీటి సెలయేరుగా మారాయి. అయితే నేడు అదే పోలీస్ వ్యవస్థ ఈ ప్రాంత ప్రజల కన్నీరును తుడ్చేందుకు ఒక్క అడుగు ముందుకేసింది. ఈ ప్రాంతంలోని గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రుద్రంగి మండలం మానాలలో నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ క్యాంపునకు దాదాపు 800 మంది గిరిజనులు హాజరయ్యారు.

ప్రజా ఆరోగ్యంతోనే పల్లెలు బాగుంటాయి

ప్రజా ఆరోగ్యంతోనే పల్లెలు బాగుంటాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మానాలలో పోలీస్‌శాఖ నిర్వహించిన మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పల్లెప్రజలకు మేమున్నామంటూ పోలీసులు వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. పోలీసులు అంటేనే భయంతో వణికిపోయే రోజులు పోయి.. వాళ్లూ.. మావాళ్లే.. మన కోసం పని చేస్తారని ప్రజలు గుర్తించే రోజు వచ్చిందన్నారు. ఈ వైద్యశిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ఎల్లారెడ్డిపేట అశ్విని ఆస్పత్రి, కరీంనగర్ రెనె ఆస్పత్రి డాక్టర్లను, సిబ్బందిని అభినందించారు. రుద్రంగిలో ప్రభుత్వ ఆస్పత్రిని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం, విద్య అనే లక్ష్యంతో ముందుకెళ్తుందని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, రాష్ట్ర యూనియన్ కోపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో వసంతరావు, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మానాల ఉచిత వైద్యశిబిరానికి హాజరైన గిరిజనులు, స్థానికులు



మానాల వైద్యశిబిరంలో ఉచిత కంటి పరీక్షలు

రక్తహీనతకు మెరుగైన వైద్యం



మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే మద్యపానానికి దూరంగా ఉండాలి. ఈ ప్రాంతంలో ఎక్కువ మందిలో రక్తహీనత సమస్య ఉంది. వారికి పరీక్షలు చేసి మెరుగైన వైద్యసేవలకు అవసరమైతే కరీంనగర్, హైదరాబాద్‌కు పంపించి ఉచిత వైద్య సేవలు అందిస్తాం.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

కమ్యూనిటీ పోలీసింగ్‌లో వైద్యశిబిరం



కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. గ్రామాల్లో యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి. పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలి. ఎవరైనా గంజాయికి అలవాటు పడితే సిరిసిల్ల డీ–అడిక్షన్ సెంటర్‌కి పంపించాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

ఎమ్మెల్యేలా.. వీధిరౌడీలా?

- బీఆర్‌ఎస్ పాలనలో ప్రతిపక్షాన్ని బతకనిచ్చారా
- ఫిరాయిస్తే సభ్యత్వం రద్దయ్యేలా చట్టసవరణ జరగాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

పెద్దపల్లిరూరల్: చట్టసభకు ఎన్నికై తాము ప్రజాప్రతినిధులమనే సంగతే మరిచి, వీధిరౌడీల్లా వ్యవహరిస్తున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్‌ఎస్ నేతలకు మాట్లాడే హక్కే లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్‌ఎస్ పాలకులని పేర్కొన్నారు. పార్టీమారిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయిస్తే సభ్యత్వం రద్దయ్యేలా చట్ట సవరణ చేయాలని సూచించారు. మావోయిస్టులను నామరూపాల్లేకుండా చేస్తామంటూ కేంద్రహోం మంత్రి అమిత్‌షా చెప్పడాన్ని ఎమ్మెల్యే సాంబశివరావు తప్పుపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తి స్వేచ్ఛను హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. అవసరమనుకుంటే కేసులు పెట్టాలే తప్ప ప్రాణాలు తీసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చెరువు, కుంటల సంరక్షణకు అమల్లోకి తెచ్చిన హైడ్రాను తొలుత స్వాగతించింది తామేనని స్పష్టం చేశారు. పేదలు నివాసముండే ఇండ్లను తప్పనిసరైతేనే కూల్చాలని సూచించారు. రాష్ట్రంలో వరదల నష్టాన్ని పూడ్చుకునేందుకు కేంద్రం రూ.10వేల కోట్లు పరిహారంగా అందించాలని కోరారు. రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, మర్రి వెంకటస్వామి, తాండ్ర సదానందం, గౌతం గోవర్దన్, సృజన్‌కుమార్, మునీర్, సమ్మయ్య, మానస్‌కుమార్, ఉదయ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

ప్రాణం పోసే వైద్యులనే చంపేస్తారా?



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్



మానవహారంగా నిరసన తెలుపుతున్న డాక్టర్లు

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాదరావు
- పెద్దపల్లిలో వైద్యుల ర్యాలీ, మానవహారం, రాస్తారోకో

పెద్దపల్లిరూరల్: ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోస్తున్న వైద్యులనే చంపేస్తారా.. తాము ప్రాణం పోసే వారమే కానీ ప్రాణాలు తీసేటోళ్లం కాదని అలాంటిది పెద్దపల్లిలో పిల్లల వైద్యుడు కొక్కుల రాజేశ్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేసేందుకు యత్నించడాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నామని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాదరావు అన్నారు. పెద్దపల్లిలోని ఐఎంఏ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రస్థాయి అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చిన వారి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు శాయశక్తులా ప్రయత్నిస్తారని, కొన్నిసార్లు క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు కూడా పోతాయని అందుకు తాము కూడా బాధపడతామన్నారు. వైద్యులకు దేవుడిగా చూసేవాళ్లున్నారని, కానీ పెద్దపల్లిలో గురువారం జరిగిన ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిలోని పిల్లల వైద్యుడు రాజేశ్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్‌రావు అన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు అప్పటివరకు తమ ఆందోళనలను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని తెలిపారు.

పెద్దపల్లిలో ర్యాలీ

వైద్యుడు రాజేశ్‌పై హత్యాయత్నానికి కారకులైన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ వైద్యులు పెద్దపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. కమాన్ వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. డాక్టర్లు వెంకటేశ్వర్‌రావు, మల్లేశం, రమాకాంత్, ప్రణీత్, విజయ, వాసుదేవరెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శిలాజ ఇంధనాల వాడకం తగ్గించాలి

గోదావరిఖనిటౌన్: శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి పునరుత్పాదక ఇంధనాలైన సోలార్, హైడ్రోజన్ వంటి విద్యుత్ శక్తి వాడకం వైపు ప్రభుత్వాలు కృషి చేయాలని పర్యావరణవేత్తలు ఉమామహేశ్వరరావు, కేపీ.ప్రతాప్ అన్నారు. శుక్రవారం గణేశ్‌నగర్‌లోని స్నేహసాహితీ గ్రంథాలయంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం వనరులను మానవులు విరివిగా వాడడం వల్ల మానవాళి మనుగడకే తీవ్ర ప్రమాదం పొంచి ఉందని అన్నారు. శిలాజ ఇంధనాల వాడకం పెరిగితే 2050నాటికి భూమి మీద తేనెటీగల మనుగడ కనుమరుగవుతుందని తెలిపారు. కార్మికులకు ఉద్యోగాల పేరుతో ఓపెన్‌కాస్టులను నెలకొల్పి కార్పొరేట్ కంపెనీలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని అన్నారు. స్నేహ సాహితీ గ్రంథాలయం అధ్యక్షుడు ఏలేశ్వరం వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యనారయణ, రవి, వేముల అశోక్, జీవీ రాజు పాల్గొన్నారు.



ఫ్లకార్డులతో పర్యావరణ వేత్తలు

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన సోమిశెట్టి శ్రీనివాస్ సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జగన్మోహన్‌రెడ్డి, అధికారులు జ్యోతి, తిరుమల ఆయిల్‌పామ్ కంపెనీ సీఈవో కేశవ్ కల్యాణ్కర్ పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగుపై సలహాలు, సూచనలు చేశారు. జిల్లాలో 2000 ఎకరాల సాగు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర్‌పంట వేసినందుకు ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లకు రూ.16,800 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.



సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

వైద్యుడిపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పిల్లల వైద్యుడు కొక్కుల రాజేశ్‌పై హత్యాయత్నం చేసిన ఖదీర్ హుస్సేన్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. పెద్దపల్లిలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగించే ఖదీర్ ఏడునెలల వయస్సు గల కూతురు అబీహ అనారోగ్యంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. పాప పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పెద్దపల్లిలోని ఆసుపత్రి వైద్యసిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన కూతురు చనిపోయిందని కోపంతో డాక్టర్‌ని చంపాలనే ఉద్దేశంతో ఖదీర్ కత్తి తీసుకుని డాక్టర్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. నిందితుడి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రాజీవ్ రహదారిపై హెచ్‌పీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా



జ్యోతినగర్: రాజీవ్ రహదారిపై హెచ్‌పీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల రాజీవ్ రహదారిపై శుక్రవారం డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా హెచ్‌పీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. ట్యాంకర్‌లో గ్యాస్ ఉండటంతో ఎన్టీపీసీ ఎస్సై కె.సతీశ్ రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఫైర్ అధికారులకు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది చేరుకొని ట్యాంకర్‌కు అనుసంధానంగా ఉన్న బ్యాటరీని తొలగించి మంటలు రాకుండా చర్యలు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ప్రమోద్‌కుమార్ సురక్షితంగా బయటపడ్డారు. ఏసీపీ రమేశ్‌తో పాటు పలువురు అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించారు.

ఉపాధ్యాయులపై డీఈవో విచారణ



విచారణ చేస్తున్న ఇన్‌చార్జి డీఈవో

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులు సదానందం, అబ్దుల్ ఖాద్రీలపై ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు శుక్రవారం పాఠశాలలో విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డీఈవో తెలిపారు.

కీచక ఉపాధ్యాయులపై పోక్సో కేసు

తారుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులు సదానందం, అబ్దుల్ ఖాద్రీలపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కాల్వశ్రీరాంపూర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. విద్యార్థినుల తల్లితండ్రుల పిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.



- సొంతూరు అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు
- తమ ప్రాంతంపై అభిమానం చాటుకుంటున్న ప్రవాసీలు
- ఆపదలో అండగా.. ఇతరులకు ఆదర్శంగా..
- జన్మభూమి సేవలో తరిస్తున్న మనోళ్లు

పుట్టిన గడ్డపై మమకారం.. ప్రగతికి సహకారం

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని... ఎదురు చూడకుండా మనకోసం.. మన భావితరాల కోసం చేయిచేయి కలిపి చేయలేమా అని ఆలోచిస్తే.. కచ్చితంగా కార్యరూపం దాల్చుతుందని కొందరు నిరూపించారు. ప్రతీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజలు తమవంతు సహకారం అందిస్తే ఆ అభివృద్ధి ఫలాలు అందరూ పొందవచ్చని నిరూపిస్తున్నారు. జన్మభూమిపై మమకారం.. ఏదో చేయాలన్న తపన వెరసి పుట్టిన ఊరి సేవలో తరిస్తున్నారు కొందరు ఎన్నారైలు. తోచిన సహాయం.. అభివృద్ధికి సహకరిస్తున్నారు. వెరసి గ్రామాభివృద్ధికి తమవంతు చేయూతనిస్తున్నారు. మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. అలాంటి ప్రవాస భారతీయులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

బాలల భవిష్యత్‌కు బాసట



బాలల గ్రంథాలయం ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ అశోక్ కాచే

మంథని: మంథనికి చెందిన డాక్టర్ అశోక్ కాచే అమెరికాలోని ఓక్లాహోమ రాష్ట్రం తుల్సా పట్టణంలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. బ్రెడ్ అనే సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. మంథని నియోజకవర్గంతోపాటు జిల్లాలోని పాఠశాలల్లో 730 బాలల గ్రంథాలయాలకు రూ.25వేల నుంచి రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. మంథనిలోని సరస్వతి శిశుమందిర్ భవన నిర్మాణానికి రూ.6 లక్షలు అందించారు.

దుబాయ్‌లో రుద్రంగి సంఘం



రుద్రంగిలో దుబాయ్ రుద్రంగి సంఘం వారు నిర్మించిన పోచమ్మ ఆలయం



శ్రీనివాస్, అధ్యక్షుడు, దుబాయ్

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి నుంచి దుబాయ్ వెళ్లిన వారు ఊరిపై మమకారంతో 'దుబాయ్ రుద్రంగి సంఘం'గా ఏర్పడ్డారు. వారి జీతం డబ్బుల నుంచి కొంతమొత్తం జమచేసి సొంతూరిలో అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నారు. ఇలా సుమారు రూ.50లక్షల వరకు అందించారు. ఊరిలో సీసీ కెమెరాలు, బస్టాండ్ ఆవరణలో పోచమ్మ ఆలయ నిర్మాణం, ఈరన్నపేట పోచమ్మ ఆలయానికి రేకులషెడ్డు వంటి పనులు పూర్తి చేశారు.

ప్రగతికి సహకారం



డాక్టర్ కుసుమ విఠల్



తోట రామ్‌కుమార్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లకు చెందిన డాక్టర్ కుసుమ విఠల్ హైదరాబాద్ గాంధీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్, ఎండీ, అమెరికాలో గ్యాస్ట్రో ఎంటరాలజీలో సూపర్ స్పెషలైజేషన్ కోర్సు చేశారు. పండుగకు సొంతూరుకొచ్చిన విఠల్ చదువుకున్న బడిని బాగుచేసేందుకు రూ.15లక్షలు విరాళంగా అందించారు. అమెరికాలో ప్లాస్టిక్ సర్జన్‌గా పనిచేస్తున్న కొడుకు శశిధర్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో మెగా వైద్యశిబిరం నిర్వహించి వందకు పైగా ఆపరేషన్లు చేశారు. గాంధీ మెడికల్ కాలేజీకి రూ.15 లక్షలు అందించారు.

వేములవాడ కోసం టీఆర్‌కే

ముప్పై ఏళ్ల క్రితం పదో తరగతి సర్టిఫికెట్‌తో దుబాయ్ వెళ్లిన తోట రామ్‌కుమార్.. కాలక్రమంలో రాజన్న పేరుతో ఎస్ఆర్‌ఆర్ బీఎంటీని ప్రారంభించి విజయవంతమయ్యారు. టీఆర్‌కే ఫౌండేషన్ పేరుతో వేములవాడ ప్రాంతాభివృద్ధి కృషి చేస్తున్నారు. ఆలయాలు, బడులు, పేదలకు నిత్యావసరాల కోసం పెద్ద మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు.

సొంతూరిపై మమకారం



బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న రాములు



మోతె రాములు

చందుర్తి(వేములవాడ): చందుర్తికి చెందిన మోతె రాములు 20 ఏళ్ల క్రితం దుబాయ్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడడంతో గ్రామాభివృద్ధిలో ముందుంటున్నారు. ప్రతిమ ఫౌండేషన్‌కు కంట్రిబ్యూషన్‌ను చెల్లించి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే గల్ఫ్‌లో ఉంటున్న వారి బంధువులు వచ్చే వరకు భద్రపరిచేలా గ్రామానికి ఫ్రీజర్‌ను అందించారు. ఇటీవల రూ.3.60లక్షలతో వైకుంఠరథం అందజేశారు.

వలస జీవి.. స్నేహశీలి



రాజేశం భార్య భారతికి రూ. 50 వేల చెక్కు అందిస్తున్న నర్సింగం మిత్రమండలి (ఫైల్)



నర్సింగం

బోయినపల్లి(చొప్పదండి): జీవనోపాధి కోసం ఇరవై ఏళ్ల క్రితం దుబాయి వెళ్లిన బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన వరాల నర్సింగంపటేల్ ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలను ఆదుకుంటున్నారు. దుబాయ్‌లో ఉంటూనే మిత్రుల ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వివిధ కారణాలతో మృతిచెందిన గ్రామస్తులు, స్నేహితుల కుటుంబాలు రోడ్డున పడకుండా ఆర్థికంగా ఆదుకుంటున్నారు. స్థానిక మల్లికార్జున ఆలయానికి రూ.3.90 లక్షలు అందించారు. సుమారు 50 మందికి దుబాయ్‌లో ఉపాధి కల్పించారు.


గల్ఫ్‌లో ఉన్నా పుట్టిన ఊరిపై అభిమానం



గంభీర్‌పూర్‌లో వలసజీవుల సహకారంతో నిర్మించిన బస్టాండ్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన పలువురు యువకులు దుబాయి, సౌదీఅరేబియా, బహ్రెయిన్, మస్కట్ వెళ్లారు. ఉపాధి కోసం ఊరిని వదిలినప్పటికీ గ్రామాభివృద్ధిలో ముందుంటున్నారు. ఆరేళ్ల క్రితం రూ.3లక్షలతో బస్టాండ్, రూ.8 లక్షలతో హనుమాన్ ఆలయం నిర్మించారు.

సామాజిక సేవలో తండ్రీకొడుకులు



లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఆవిష్కరణలో శశాంక్



వద్దెపల్లి శ్రీనివాస్

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి శ్రీనివాస్ 1995లో ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేస్తూనే తన కుమారుడు శశాంక్ ద్వారా గ్రామంలోని సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారు. మల్యాలలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష అందించారు. స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మల్యాల జీపీకి ట్రాక్టర్ అందజేశారు. ముత్యంపేటలో మసీదు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.